
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శనివారం । 8 । అక్టోబర్ । 2022

గిరులతో దోబూచులాట

రాజవొమ్మంగి: మండల పరిసరాల్లో శుక్రవారం ప్రకృతి సోయగాలు కనువిందు చేశాయి. మేఘాలు గిరులతో దోబూచులాడుతూ ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకున్నాయి.






పల్లె వెలుగు బస్సుకు ప్రమాదం


డ్రైవర్, కండక్టర్, మరో ఇరువురికి గాయాలు

10లో









ప్రాజెక్టు	సాధారణ నీటిమట్టం	ప్రస్తుత నీటిమట్టం	విడుదలవుతున్న నీరు
సూరంపాలెం	105 మీటర్లు	104.5 మీటర్లు	300 క్యూసెక్కులు
మద్దిగెడ్డ	188 మీటర్లు	187.25మీటర్లు	229 క్యూసెక్కులు
భూపతిపాలెం	204 మీటర్లు	203.8 మీటర్లు	110 క్యూసెక్కులు
ముసురుమిల్లి	115 మీటర్లు	115 మీటర్లు	170 క్యూసెక్కులు

వదలని వాన

జిల్లాలోని అన్ని మండలాల్లోను నాలుగు రోజుల నుంచి విస్తారంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుండపోత వానతో జనజీవనానికి అంతరాయం ఏర్పడుతోంది. ఘాట్ ప్రాంతాల్లో కూడా భారీ వర్షాలు కురుస్తుండడంతో వాహనాల రాకపోకలకు కూడా ఇబ్బందిగా మారింది. రంపచోడవరం డివిజన్‌లోని ప్రధాన జలాశయాలకు వరద తాకిడి నెలకొనడంతో అదనపు నీటిని విడుదల చేస్తున్నారు.

- ఎడతెరిపి లేకుండా వర్షాలు
- లోతట్టు ప్రాంతాల జలమయం
- జలాశయాలకు పోటెత్తిన వరదనీరు
- గేట్లు ఎత్తి దిగువకు విడుదల

సాక్షి, పాడేరు : జిల్లాలోని అన్ని మండలాల్లోనూ శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపిలేకుండా వర్షం కురుస్తూనే ఉంది. డుంబ్రిగుడ మండలంలోని అరకు, పాడేరు మండల కేంద్రంలోని వారపుసంతలకు అంతరాయం ఏర్పడింది. జోరు వానతో సంత జరగలేదు. గిరిజనులు కూడా గ్రామాల నుంచి మండల కేంద్రాలకు రాకపోకలు నామమాత్రంగానే ఉన్నాయి. సంతల్లో వ్యాపార లావాదేవీలు కూడా స్తంభించాయి.

పెరిగిన చలిగాలులు..

జిల్లా వ్యాప్తంగా ఈదురు గాలులతో కూడిన వర్షం కారణంగా చలి గాలులు కూడా అధికమయ్యాయి. ప్రధాన వాగులు, గెడ్డల్లో వరద ఉధృతి నెలకొంది. పాడేరు డివిజన్‌కు సంబంధించిన మత్స్యగెడ్డ, రాళ్లగెడ్డ, పెద్దగెడ్డ, చాపరాయి గెడ్డ, దిగుడుపుట్టు గెడ్డ, కోడిమామిడి గెడ్డ, అనంతగిరి మండలంలోని శారద, గోస్తనీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

విలీన మండలాల్లోనూ ఉధృతి..

విలీన మండలాల్లో కూడా భారీ వర్షాలు కారణంగా ఆయా ప్రాంతాల్లోని గెడ్డలు, వాగుల్లో వరద ఉధృతి నెలకొంది. తెరిపినివ్వని వానతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని రాజవొమ్మంగి, అడ్డతీగల, మారెడుమిల్లి, దేవీపట్నం, రంపచోడవరం, గంగవరం, చింతూరు మండలాల పరిధిలోని ప్రధాన గెడ్డల్లో కూడా వరద ఉధృతి నెలకొంది.

రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తం

జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో అన్ని మండలాల రెవెన్యూ యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్, జాయింట్ కలెక్టర్ శివ శ్రీనివాస్, డీఆర్‌వో దయానిధిలు అప్రమత్తం చేశారు. గెడ్డ సమీప గ్రామాల ప్రజలకు హెచ్చరికలను కూడా సచివాలయ ఉద్యోగులు జారీ చేశారు. సీజనల్ వ్యాధులు సంక్రమించకుండా ఆయా ప్రాంతాల్లో వైద్య ఆరోగ్య కార్యక్రమాలను కూడా విస్తృతం చేశారు. జిల్లా వ్యాప్తంగా 515.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వర్షపాతం వివరాలు..

అనంతగిరి మండలంలో అత్యధికంగా 70.6 ఎంఎం వర్షపాతం నమోదైంది. కొయ్యూరులో 52.2, రాజవొమ్మంగిలో 45.4, రంపచోడవరంలో 36.2, పాడేరులో 33.8, డుంబ్రిగుడలో 30, మారెడుమిల్లిలో 33.2, అడ్డతీగలలో 35.2, గంగవరంలో 25.6, జి.మాడుగులలో 24.6, చింతపల్లిలో 24.4, వై.రామవరంలో 28.2, హుకుంపేటలో 15, జి.కె.వీధిలో 10.2, దేవీపట్నంలో 16.8, అరకులోయలో 9.8, వీఆర్‌పురంలో 5.4, కూనవరంలో 5.4, పెదబయలులో 4.2, ఎటపాకలో 4.2, ముంచంగిపుట్టులో 2.4, చింతూరులో 2.8 ఎంఎం వర్షపాతం నమోదైనట్టు కలెక్టరేట్ అధికారవర్గాలు తెలిపాయి.

సాధారణానికి మించి వర్షపాతం

రాజవొమ్మంగి : జిల్లాలో జూలై నుంచి ఇప్పటి వరకు సాధారణానికి మించి వర్షపాతం నమోదైనట్టు అధికారవర్గాలు తెలిపాయి. జూలైలో సాధారణం 295.1 ఎంఎంకు 312.2 ఎంఎం, ఆగస్టులో 252.5 ఎంఎంకు 243.4 ఎంఎం, సెప్టెంబర్‌లో 185 ఎంఎంకు 284.2 ఎంఎం నమోదైంది. జిల్లాలో జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సాధారణ వర్షపాతం 895 ఎంఎం కాగా, ఇప్పటివరకు 986.1 ఎంఎం వర్షం కురిసిందని అధికారవర్గాలు తెలిపాయి.



వట్టిగెడ్డ జలాశయం పొర్లుకట్టుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు

ప్రాజెక్టులకు జలసిరి

రంపచోడవరం: రంపచోడవరం డివిజన్ పరిధిలో కురుస్తున్న వర్షాలకు జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయి. ముసురుమిల్లి ప్రాజెక్ట్ సాధారణ నీటిమట్టం 115 మీటర్లు, ప్రస్తుత నీటిమట్టం కూడా అదేస్థాయిలో ఉంది. ప్రాజెక్టుకు గేట్లు ఏర్పాటుచేయకపోవడం వల్ల 115 మీటర్లకు మించిన నీరంతా దిగువకు విడుదల అవుతోంది. ప్రస్తుతం ఆయకట్టుకు 170 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు అధికారవర్గాలు తెలిపాయి.భూపతిపాలెం ప్రాజెక్టు సాధారణ నీటిమట్టం 204 మీటర్లు, ప్రస్తుతం 203.8 మీటర్ల మేర ఉంది. ఆయకట్టుకు 110 క్యూసెక్కులు విడుదల చేస్తున్నామని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

అడ్డతీగల: మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు అడ్డతీగలలోని మద్దిగడ్డ జలాశయంలో భారీగా వరదనీరు చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 188 మీటర్లు. ప్రస్తుతం 187.25 మీటర్లకు నీటిమట్టం మించకుండా ప్రాజెక్ట్ అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. గురువారం అర్ధరాత్రి నుంచి ఎగువ ప్రాంతం నుంచి భారీ స్థాయిలో వరదనీరు చేరుతోంది. దీంతో ప్రధాన గేట్లలో రెండవ గేటును ఎత్తి 229 క్యూసెక్కుల నీటిని దిగువకు విడిచిపెడుతున్నట్టు జలాశయం అసిస్టెంట్ ఇంజినీర్ గోపీకృష్ణ తెలిపారు. ఈనీరంతా ఏలేరు వాగులో చేరడంతో కాలువ ప్రవాహం పెరుగుతోందన్నారు. ఏలేరు వాగు పరివాహక ప్రాంత రైతులు అప్రమత్తంగా ఉండాలని, వాగులోకి దిగేందుకు ప్రయత్నించవద్దని ఆయన సూచించారు.

గంగవరం : ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలో చెరువులతోపాటు సూరంపాలెం జలాశయంలోకి భారీగా వరద నీరు చేరుతోంది. ప్రాజెక్ట్ సాధారణ నీటిమట్టం 105 మీటర్లు, ప్రస్తుతం 104.5 మీటర్లకు చేరడంతో శుక్రవారం ఉదయం సూరంపాలెం రిజర్వాయర్ ఒక గేట్‌ను ఎత్తివేసి 300 క్యూసెక్కుల వరదనీటిని బురదకాలువలోకి విడుదల చేస్తున్నారు.

భారీగా వరదనీరు

రాజవొమ్మంగి: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు మడేరు ఆనకట్ట, అప్పలరాజుపేటలోని వట్టిగెడ్డ జలాశయంలో భారీగా వరదనీరు చేరుతోంది. పొర్లుకట్టు మీదుగా దిగువకు విడుదల అవుతోంది.

న్యూస్‌రీల్

వికేంద్రీకరణతోనే సమగ్రాభివృద్ధి

- 9న ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతో సమావేశం
- సమావేశంలో పాల్గొనున్న మంత్రి అమర్‌నాథ్
- ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు : వికేంద్రీకరణతోనే రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందనే నినాదంతో ఈ నెల 9న పాడేరు కాఫీహౌస్‌లో అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజా సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే, జిల్లా పార్టీ అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరవుతారన్నారు. అలాగే అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, జెడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్లు జల్లిపల్లి సుభద్ర, డాక్టర్ శోభ స్వాతిరాణి, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబులు కూడా హాజరవుతున్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆదివారం నిర్వహించే ఈ సమావేశానికి అన్ని వర్గాల ప్రజలు, స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి ప్రకటనలో కోరారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు



పీవో సమక్షంలో అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న అధికారులు

రంపచోడవరం : చింతూరు ఐటీడీఏ పరిధి కూనవరం ఐసీటీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ హెల్పర్, వర్కర్ పోస్టుకు శుక్రవారం ఇంటర్వ్యూలు నిర్వహించినట్టు రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రెండు పోస్టుల్లో గాను అంగన్‌వాడీ హెల్పర్‌కు ఒకరు, వర్కర్‌కు తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. అభ్యర్థులను జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సూర్యలక్ష్మి, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ అనూష, సీడీపీవోలు విమల, సంధ్యారాణితో ఏర్పాటు చేసిన కమిటీ ఇంటర్వ్యూ చేసిందని పీవో పేర్కొన్నారు.

రోలర్ స్కేటింగ్ పోటీల్లో గిరి విద్యార్థి ప్రతిభ

సిల్వర్ మెడల్ సాధించిన కార్తీక్



జి.మాడుగుల: విశాఖలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీల్లో జి.మాడుగుల మండలం నుర్మతి గ్రామానికి చెందిన గిరిజన విద్యార్థి జీలుగుల కార్తీక్ సిల్వర్ మెడల్ సాధించాడు. 7నుంచి 9 సంవత్సరాల వయసు గల విద్యార్థులకు జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు జరిగాయి. వీటిలో ప్రతిభ కనబరిచిన కార్తీక్ ద్వితీయ స్థానంలో నిలిచి, సిల్వర్ మెడల్ సాధించాడు. కార్తీక్ అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నలంద పాఠశాలలో నాలుగవ తరగతి చదువుతున్నాడు. పతకం సాధించిన అతనిని పలువురు అభినందించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల అహ్వానం

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు : జిల్లా వ్యాప్తంగా ఖాళీగా ఉన్న 53 వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. గ్రామ వలంటీర్ల భర్తీతో అన్ని సచివాలయాల్లో మెరుగైన సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. గ్రామ వలంటీర్ల భర్తీకి ఆయా ఎంపీడీవోలు ఏడున నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. 10నుంచి 12వ తేదీలోపు దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. 13న దరఖాస్తుల పరిశీలన, 14న సెలక్షన్ కమిటీ మౌఖిక పరీక్ష నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులను 15న వెల్లడిస్తామని పేర్కొన్నారు. 17వ తేదీన ఒక రోజు శిక్షణ ఇచ్చి 18న నియామక ఉత్తర్వులు అందజేస్తామని ఆయన తెలిపారు. జిల్లాలోని చింతూరులో 11, జి.మాడుగులలో 07, జి.కె.వీధిలో 05, అడ్డతీగలలో 05, గంగవరం, పాడేరు, కొయ్యూరు మండలాల్లో 04 చొప్పున, మారేడుమిల్లిలో 03, వై.రామవరం, చింతపల్లి, రాజవొమ్మంగిలో 02 చొప్పున, హుకుంపేట, కూనవరం, రంపచోడవరం, వీఆర్‌పురంలో ఒక్కొక్క ఖాళీలు ఉన్నట్టు కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

భవన నిర్మాణాలు పూర్తి చేయండి

కలెక్టర్ సుమిత్ కుమార్

సాక్షి,పాడేరు : ప్రభుత్వ ప్రాధాన్యం భవన నిర్మాణాలను నిర్దేశించిన సమయానికి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. జిల్లాలోని పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు, గిరిజన సంక్షేమశాఖ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశం నిర్వహించారు. రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనాల పురోగతిపై ఐటీడీఏల వారీగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చేసిన పనుల బిల్లులు వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే చెల్లింపునకు తగిన చర్యలు చేపడతామని సూచించారు. కాంట్రాక్టర్లు పనులు చేయకపోతే వారిని తొలగించి వేరొకరికి పనులు అప్పగించాలని స్పష్టం చేశారు. ఐటీడీఏ పీవోలు భవన నిర్మాణాలపై సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో పాడేరు ఐటీడీఏ పీవో ఆర్.గోపాలకృష్ణ, రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, చింతూరు పీవో పి.రామశేషు, పంచాయతీరాజ్, పీఐయు ఇఇ కె.లావణ్యకుమార్, డ్వామా పీడీ రమేష్ రామన్, ఉపాధిహామీ ఏపీడీ గిరిబాబు, ఎంపీడీవోలు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ నుంచి వీడియో సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

నాడు-నేడు పనులు వేగవంతం

ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి వినోద్‌బాబు

సాక్షి,పాడేరు : జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఎం.వినోద్‌బాబు ఆదేశించారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఎంవీ శేషగిరిరావు, ఏపీ ప్రభుత్వ సలహాదారు ఎ.మురళి, ఇంటర్‌బోర్డు ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఐ.శారద తదితర అధికారులతో నాడు-నేడు పనులపై శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పలు జూనియర్ కళాశాలల్లో జరుగుతున్న నాడు-నేడు పనులపై ఆయన సమీక్షించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులకు మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలపై అధ్యాపకులు, హాస్టల్ నిర్వాహకులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని ఆయన కోరారు.



మాట్లాడుతున్న వినోద్ బాబు

కాబోయే భార్యను హతమార్చిన ఘనుడు

- ప్రియురాలితో కలిసి పన్నాగం
- ఏడాది తరువాత వెలుగులోకి..
- నిందితులను అరెస్టు చేసిన పోలీసులు

చింతపల్లి : కాబోయే భార్యను ప్రియురాలితో కలిసి హత్య చేసిన సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. అన్నవరం పోలీసు స్టేషన్ పరిధిలో సంపంగిపుట్టు గ్రామంలో ఏడాది క్రితం ఈ సంఘటన చోటు చేసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ మేరకు శుక్రవారం ఏఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ హత్యకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. సంపంగిపుట్టుకు చెందిన చెదల కాంతమ్మకు అదే గ్రామానికి చెందిన వండలం గోపాల్‌తో 2021లో పెళ్లి సంబంధం కుదిరింది. గోపాల్‌తో కోరాబు లక్ష్మికి గత కొన్నేళ్లుగా ప్రేమ వ్యవహారం నడుస్తున్నట్లు పోలీసులు తెలిపారు. చెదల కాంతమ్మ పెళ్లి సంబంధం చూసినప్పుడు గోపాల్‌తో చనువుగా ఉంటూ లక్ష్మి కలవడాన్ని ఆమె అంక్షలు పెట్టింది. దీంతో గోపాల్‌ను నన్ను ప్రేమించి ఆమెతో ఎలా పెళ్లి చేసుకుంటావంటూ నిలదీసి, తాను ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించింది. దీంతో కాంతమ్మను అడ్డు తొలగించాలని గోపాల్‌పై లక్ష్మి ఒత్తిడి పెంచింది. వారిద్దరూ కలిసి పథకం ప్రకారం గత ఏడాది వినాయక చవితి రోజున హత్య చేసి సమీపంలోని పసుపు దొడ్డిలో పాతిపెట్టారు. కాంతమ్మ కనిపించడం లేదని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు మొదలు పెట్టారు. కాంతమ్మను హత్య చేసి పసుపు దొడ్డిలో పాతిపెట్టిన విషయాన్ని పోలీసులు విచారణలో గుర్తించారు. నిందితులు గోపాల్, లక్ష్మిని శుక్రవారం అరెస్టు చేశారు.



హత్య కేసులో నిందితులతో పోలీసులు

'స్పందన' సమస్యలు తక్షణమే పరిష్కారం

- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం
- స్పందనలో 32 అర్జీలు స్వీకరణ

సాక్షి,పాడేరు : స్పందన కార్యక్రమంలో గిరిజనుల నుంచి స్వీకరిస్తున్న వినతులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీడీఏ సమావేశ మందిరంలో ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, సబ్ కలెక్టర్ అభిషేక్, డీఆర్వో బి.దయానిధితో కలిసి స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించనప్పటికీ పలు గ్రామాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి 32 వినతులు స్వీకరించారు. వారితో కలెక్టర్, ఐటీడీఏ పీవో, సబ్ కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

- గెడ్డ ప్రాంతంలో మినీ బ్రిడ్జి మంజూరు చేయాలని హుకుంపేట మండలం రాప పంచాయతీ ఈదులగరువు గ్రామస్తులు అర్జీ అందజేశారు.
- విద్యుత్ స్తంభాలను మార్పు చేయడమే కాకుండా సమస్యలు పరిష్కరించాలని అరకులోయ మండలం బొండం సర్పంచ్ దురియా భాస్కరరావు తదితరులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీహక్కు పత్రాలు, రహదారులు, తాగునీటి సమస్యలు, భూ సమస్యలు, రేషన్‌కార్డులు, పింఛన్ల కోసమే ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయన్నారు. వీటిని అధికారులు పరిశీలించి అర్జీదారులకు సత్వరమే న్యాయం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇంజనీరింగ్ శాఖల ఈఈలు డీవీఆర్ఎం రాజు, కె.వేణుగోపాల్, లావణ్యకుమార్, బాలసుందర బాబు, డీడీ కొండలరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ బి.సుజాత, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలా ప్రసాద్, డీఎల్పీవో కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- బూదరాళ్ల గ్రామంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి సంబంధించిన బిల్లులు చెల్లించాలని కొయ్యూరు మండలం మర్రివాడ పంచాయతీ దొడ్డవరం గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ కనిగిరి రాజు వినతిపత్రం అందజేశారు.
- వితంతు పింఛను మంజూరు చేయాలని జి.మాడుగుల మండలం సొలభం పంచాయతీ మల్లిపాడు గ్రామానికి చెందిన కాకర సోములమ్మ అధికారులను కోరింది.
- వృద్ధాప్య పింఛను మంజూరు చేయాలని వంజరి పంచాయతీ వంతలపాడుకు చెందిన కె.సింహాచలం వినతిపత్రం అందజేసింది.



గిరిజనుల నుంచి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ సుమిత్ కుమార్

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి

మారేడుమిల్లి : రంపచోడవరం నియోజకవర్గ పరిధిలోని సత్యసాయి మంచినీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పాడేరులో జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారేడుమిల్లి, అడ్డతీగల రంపచోడవరం, గంగవరం, వై.రామవరం ఐదు గ్రామాల పరిధిలో 125 గ్రామాల్లో 64 మంది కార్మికులు గత 15 ఏళ్లుగా పనిచేస్తున్నామని తెలిపారు. అప్పటి నుంచి సత్యసాయి మంచినీటి పథకం ప్రాజెక్ట్‌ను నమ్ముకుని చాలీచాలని జీతాలలో రోజులు గడుపుతున్నామని తెలిపారు. గత ఏడు నెలలుగా జీతాలు అంద లేదని వారు వాపోయారు. దీంతో పాటు తమకు రావల్సిన అలెవెన్సులు అందక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు వాపోయారు. తక్షణమే పెండింగ్ జీతాలు చెల్లించి సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను కోరామని వారు పేర్కొన్నారు.

టీడీపీ భూస్థాపితం ఖాయం



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

- అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ
- టీడీపీకి చెందిన పలువురు వైఎస్సార్‌సీపీలో చేరిక
- పార్టీ కండువాలు వేసి ఆహ్వానించిన ఎమ్మెల్యే

అరకులోయ రూరల్ : టీడీపీ భూస్థాపితం ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. స్థానిక గ్రీన్‌వ్యాలీ లాడ్జి అవరణలో వైఎస్సార్ సీపి సీనియర్ నాయకులు శెట్టి అప్పాలు,రఘనాథ్ ఆధ్వర్యంలో శుక్రవారం మాడగడ, పెదలబుడు, పద్మాపురం పంచాయతీల పరిధిలోని టీడీపీకి చెందిన వార్డు సభ్యులు శెట్టి దేవాదష్, కొండప్ప, అప్పన్న, లచ్చు, సీనియర్ నాయకులు బారికి పండు, తమన్న, అప్పలరాజు తదితర 100 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు, స్థానిక ఎమ్మెల్యే పనితీరుకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే పాల్గుణ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలోని ముఖ్య నాయకులు తమ పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారన్నారు. పెదలబుడు పంచాయతీ నువ్వగుడ గ్రామ యువకులకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చేతుల మీదుగా వాలీబాల్ కిట్లు అందజేశారు. వైస్ ఎంపీపీ కిల్లో రామన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజారమేష్ తదితరులు పాల్గొన్నారు.



పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

పది కుటుంబాల చేరిక

మారేడుమిల్లి : మండలంలోని కుండాడ గ్రామానికి చెందిన పది కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. శుక్రవారం రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి కుండాడ పంచాయతీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె సమక్షంలో పది కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, కోఆప్షన్ సభ్యుడు గురుకు ధర్మరాజు, పార్టీ మండల కన్వీనర్ సత్తి సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి బొడ్డేటి గంగరాజు, కుండాడ సర్పంచ్ కుండ్ల ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ కుండ్ల సీతామహాలక్ష్మి, నాయకులు దూడ స్మిత్, బచ్చెల రాధాకృష్ణ, రామారావు, కాసగానీ సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాలతో అధిక ఆదాయం

- కోళ్లు, మేకలు, చేపల పెంపకంపై రైతులకు అవగాహన
- కేవీకే శాస్త్రవేత్తల సూచనలు

రంపచోడవరం: ఏజెన్సీలో గిరిజన రైతులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) కృషి చేస్తోంది. ఇందులో భాగంగా వ్యవసాయ అనుబంధ రంగాలు ద్వారా రైతులు దృషి సారించే విధంగా శిక్షణ ఇస్తున్నారు. కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా మేకలు, కోళ్లను రైతులకు అందజేస్తున్నారు. పుట్టగొడుగులు, తేనెటీగలు పెంపకంపై శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే అనేక మంది యువ రైతులకు శిక్షణ ఇచ్చారు సమగ్ర వ్యవసాయ విధానంపై ఆరు రోజు పాటు రైతులకు శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా కేవీకె శాస్త్రవేత్తలు రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. మారేడుమిల్లి, వై.రామవరం మండలాలకు చెందిన రైతులున్నారు.



మేకల పెంపకంపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

ఏక పంట విధానంతో నష్టం

కేవీకె కో-ఆర్డినేటర్ డాక్టర్ లలితాకామేశ్వరి మాట్లాడుతూ గిరిజన రైతులు ఏక పంట వ్యయసాయ విధానం అవవలంభించి ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగి ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. సమగ్ర వ్యవసాయ విధానంలో కేవలం పంటలపై మాత్రమే ఆధార పడకుండా వ్యవసాయ అనుబంధ రంగాలైన ఉద్యాన పంటలు, మేకలు, కోళ్లు, పుట్టగొడుగులు పెంపకం వంటివి చేపట్టం వలన రైతులకు ఆదాయం పెరగడమే కాకుండా ప్రతీ ఏటా సుస్థిర ఆదాయాన్ని పొందవచ్చు. సేంద్రియ ఎరువుల తయారీ వాడకం, ఉపయోగం, ఉద్యాన పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు, నర్సరీ యాజమాన్యం, వానపాముల ఎరువు తయారీ, పుట్టగొడుగులు, తేనెటీగల పెంపకంపై క్షేత్రస్థాయిపై కేవీకే శాస్త్రవేత్తలు అవగాహన కల్పిస్తున్నారు.

26 రోజుల వ్యవధిలో కవలలు మృతి

రాజవొమ్మంగి : మండలంలోని అనంతగిరి గ్రామంలో 26 రోజుల వ్యవధిలో పొత్తిళ్ళలోని కవల పిల్లలు బాబు, పాప ఒకరి తరువాత మరొకరు మరణించిన సంఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తుల కథనం మేరకు అనంతగిరి గ్రామానికి చెందిన వారాత్రి సంధ్యారాణికి తన మూడవ కాన్పులో సెప్టెంబర్ 11వ తేదీన అడ్డతీగల కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో కవలలకు జన్మనిచ్చింది. బాబు కేవలం 8 గ్రాములు, పాప 1200 గ్రాముల బరువుతో పుట్టడంతో వారిని వైద్యులు వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. కాగా అక్కడ చికిత్స పొందుతూ బాబు చనిపోయాడు. ప్రాణాలతో వున్న ఆడబిడ్డను తీసకొని తల్లి సంధ్య సెప్టెంబర్ 24వ తేదీన ఇంటికి వచ్చేసింది. కాగా పాప పాలు తాగడం లేదని గుర్తించిన ఆ గ్రామానికి చెందిన ఏఎస్ఎం వరహాలు తల్లిబిడ్డలను తిరిగి కాకినాడ జీజీహెచ్‌లో చేర్పించింది. అక్కడ వుండలేమని బిడ్డను తీసుకొని సంధ్య 26వ తేదీన తిరిగి స్వగ్రామం అనంతగిరి వచ్చేసింది. కాగా పాప ఆరోగ్యపరిస్థితి మరింత విషమించి ఈనెల 5వ తేదీన ఇంటి వద్దనే మరణించింది. సంధ్య ఈడీబీ (పురుడు రావాల్సిన తేదీ) తేదీ అక్టోబర్ 11వ తేదీ కాగా రెండు నెలల ముందుగానే కాన్పు రావడంతో బరువు తక్కువ పిల్లలు పుట్టారని, రోజుల వ్యవధిలోనే ఇరువురు మరణించారని లాగరాయి పీహెచ్‌సీ వైద్యులు తెలిపారు.

దివ్యాంగులకు వీల్ ఛైర్ల పంపిణీ



దివ్యాంగులకు వీల్ చైర్లను అందజేస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ, ఇతర అధికారులు

సాక్షి,పాడేరు : ఇండియన్ రెడ్‌క్రాస్ సహకారంతో మండలంలోని ముగ్గురు దివ్యాంగులకు కలెక్టర్ సుమిత్‌కుమార్, ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ చేతుల మీదుగా వీల్ చైర్‌లను పంపిణీ చేశారు. పాడేరు మండలం లగిశపల్లి గ్రామానికి జన్ని రామయ్య, పార్వతీపురం గ్రామస్తులు కోడా దొమ్మన్న, పాతపాడేరు గ్రామానికి చెందిన అత్తిలి భూలోక దివ్యాంగులు కావడంతో నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను గుర్తించిన పాడేరు రెడ్‌క్రాస్ సొసైటీ అధికారులు ఆ ముగ్గురు దివ్యాంగులకు వీల్ చైర్లను అందుబాటులో తెచ్చారు. వాటిని కలెక్టర్, ఐటీడీఏ పీవోలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ సొనాయి గంగరాజు, ఇతర ప్రతినిధులు ఈశ్వరరావు, టి.అప్పారావు, కోటేశ్వరరావు, సూర్యరావు, సుబ్రమణ్యం, జయ తదితరులు పాల్గొన్నారు.

పల్లె వెలుగు బస్సుకు ప్రమాదం

రాజవొమ్మంగి : దూసరపాము వద్ద శుక్రవారం ఏలేశ్వరం డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సు ప్రమాదానికి గురైంది. ఎదురుగా వస్తున్న మోటారు సైకిల్ తప్పించే క్రమంలో అదుపు తప్పి ఓ తాటి చెట్టును ఢీ కొట్టింది. దీంతో డ్రైవర్ శివప్రసాద్ కుడికాలు విరిగింది. కండక్టర్ బాబుకు కంటిపై గాయమైంది. ప్రయాణికుల్లో శిరోమణి, అప్పారావు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వీరిని స్థానికులు వెంటనే 108 సహాయంతో స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స చేశారు. మెరుగైన వైద్యం కోసం డ్రైవర్, కండక్టర్‌లను ఏలేశ్వరం సీహెచ్‌సీకి రిఫర్ చేశారు. ఏలేశ్వరం నుంచి అతి తక్కువ మంది ప్రయాణికులతో కింద్ర వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. స్టీరింగ్ పట్టేయడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్టు చెబుతున్నారు.

మీరెందుకు తనిఖీలు చేయడం లేదు?

- బంకులు, దుకాణాల తనిఖీలపై నిర్లక్ష్యం తగదు
- మిల్లర్లతో రైతుకు సంబంధం లేకుండా చర్యలు చేపట్టండి
- ఉత్తరాంధ్ర జిల్లాల డీఎస్‌వోలు, డీఎంలకు మంత్రి కారుమూరి ఆదేశం



సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి కారుమూరి, పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్, ఎండీ వీరపాండ్యన్, జేసీ విశ్వనాథన్

సాక్షి, విశాఖపట్నం : 'ప్రజలు ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పదే పదే చెబుతున్నారు. మంత్రులు, ఉన్నతాధికారులు అప్పుడప్పుడు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాం. కానీ జిల్లా స్థాయి అధికారులు ఎందుకు అలసత్వం వహిస్తున్నారు.? ఇకపై ప్రతి నెలా తనిఖీలకు సంబంధించిన నివేదికలు సమర్పించాలి. లేదంటే క్రమశిక్షణ చర్యలు తప్పవు'

అంటూ ఉత్తరాంధ్ర జిల్లాల డీఎస్‌వోలు, డీఎంలకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హెచ్చరించారు.

జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ హెచ్. అరుణ్ కుమార్, పౌర సరఫరాల సంస్థ ఎండీ వీరపాండ్యన్, జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్‌తో కలసి ఉత్తరాంధ్ర జిల్లాల పౌర సరఫరాల శాఖ, పౌర సరఫరాల సంస్థ, లీగల్ మెట్రాలజీ, విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ ధాన్యం సేకరణపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని, మిల్లర్లకు సంబంధం లేకుండా రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరణ చేయాలన్నారు. మిల్లర్లు ధాన్యం సేకరణపై రైతులకు పలు కారణాలు చూపి ధరలు తగ్గించే అవకాశం ఉందనీ.. ఈ పరిస్థితి తలెత్తకుండా.. రైతులు నష్టపోకూడ దన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు. ధాన్యం సేకరణపై ఏ ఒక్కరు అలసత్వం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇతర రాష్ట్రాల నుంచి ఒక్క ధాన్యం గింజ తరలి రాకుండా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ధాన్యం సేకరణకు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. మిల్లుల్ని తరచు తనిఖీలు చేయాలని, ప్రతి నెలా డీఎస్‌వో, డీఎం, లీగల్ మెట్రాలజీ అధికారులు ఎన్ని తనిఖీలు చేశారో ఆ వివరాలను పంపాలన్నారు. ప్రతీ నెల బియ్యం సరఫరా చేసే వాహనాలు ఇంటింటికి వెళ్లలేని పరిస్థితిలో సచివాలయం వద్ద ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వివిధ కారణాల రీత్యా రైస్ కార్డులు కోసం దరఖాస్తులు చేసుకుంటే, ఆ దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా సత్వర చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. లీగల్ మెట్రాలజీ అధికారులు మాల్స్, ఎరువుల షాపులు, పెట్రోల్ బంకులు తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినట్లు చెబుతూ లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులను మంత్రి అభినందించారు. కమిషనర్ హెచ్.అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఖరీఫ్ సందర్భంగా వచ్చే ధాన్యం సేకరణపై ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని ఆదేశం చారు. ఈ క్రాప్ లో నమోదు చేసిన రైతులు వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని స్పష్టం చేశారు. ఎండీ వీరపాండ్యన్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలలో భాగంగా పౌర సరఫరాలు ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నట్లు వివరించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో మండల కమిటీలు ఏర్పాటు చేసి శిక్షణ ఇవ్వాలన్నారు. సమీక్షలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ స్వరూపా రాణి, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ పట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల డీఎస్ఓ, డీఎంలు, లీగల్ మెట్రాలజి అధికారులు పాల్గొన్నారు.

సుధాకర్ గెలుపునకు కృషి చేయాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్

ముంచంగిపుట్టు: ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపునకు అందరూ కృషి చేయాలని పార్టీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ అన్నారు. మండల కేంద్రంలో పార్టీ శ్రేణులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. పట్టభద్రుల ఓటర్ నమోదు దరఖాస్తులను నేతలకు అందజేశారు. ఈ సందర్భంగా చెట్టి వినయ్ మాట్లాడుతూ పట్టభద్రులను ఓటర్లుగా నమోదుకు నేతలంతా కృషి చేయాలని కోరారు. 2019 అక్టోబర్ నాటికి డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులంతా అర్హులని, నవంబర్ 7వ తేదీలోగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ గెలుపునకు పార్టీ శ్రేణులంతా సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఎంపీపీ సీతమ్మ, మండల సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్, నాయకులు జగబందు, మత్స్యలింగం, సన్యాసిరావు, రామ్మూర్తి, దాసు, పులిరాజు, రాంప్రసాద్, తిరుపతి, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోమతెరల పంపిణీ



లివిటిపుట్టులో దోమతెరలు అందజేస్తున్న పాస్టర్ మార్కు

డుంబ్రిగుడ: పోతంగి పంచాయతీ లివిటిపుట్టు, సిందిపుట్టు గ్రామస్తులకు హైదారాబాద్‌కు చెందిన పాస్టర్ యేసుదాసు ఆర్థికసాయంతో పాస్టర్ రెంగి మార్కు శుక్రవారం దోమ తెరలను అంజేశారు. ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమతెరలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భారీ అన్నసమారాధన



అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

వై.రామవరం: దేవరమడుగులు గ్రామంలోని కనకదుర్గ అమ్మవారి ఆలయం ప్రాంగణంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ ముత్యాల నూకరాజు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు. వెదురునగరం శ్రీ సాయిరామ్ ఆశ్రమ దేవాలయ గురుస్వామి సాయిరామ్ తదితరులున్నారు. కార్యక్రమానికి గ్రామపెద్దలు, యువత సహాయ సహకారాలు అందించినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

అడ్డతీగల: అడ్డతీగలలోని సినిమాహాలు కాలనీ వద్ద వేంచేసిన కనకదుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన జరిగింది. అమ్మవారి భారీ ఊరేగింపు గురువారం జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్వాహక కమిటీ సభ్యులు, స్థానికులు కలిసి ఆలయం వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ప్రసాదాన్ని స్వీకరించారు.

డ్రాపౌట్లను గుర్తించాలి



సూచనలిస్తున్న ఎంపీడీవో ఉమా మహేష్

గూడెంకొత్తవీధి: బడిబయట ఉన్న డ్రాపౌట్ల చిన్నారులను గుర్తించాలని ఎంపీడీవో ఉమా మహేష్ సూచించారు. సచివాలయాల సంక్షేమ సహాయకులతో ఆయన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 313 మంది డ్రాపౌట్లు ఉన్నట్టు గుర్తించామన్నారు. ఇప్పటివరకు డ్రాపౌట్ల గుర్తింపు ప్రక్రియ 65శాతం పూర్తయిందని, మిగిలినది త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఆయన ప్రతీ పిల్లవాడు పాఠశాలల్లో ఉండాలన్నారు. బడి బయట ఉన్న వారిని గుర్తించే బాధ్యత సంక్షేమ సహాయకులపై ఉందన్నారు. ఎంపీపీ బోయిన కుమారి, ఈవోపీఆర్డీ పాపారావు, అధికారులు పాల్గొన్నారు.

వరద బాధితులకు యూటీఎఫ్ వితరణ



వరద బాధితులకు సరకులు పంపిణీ చేస్తున్న యూటీఎఫ్ నేతలు

కూనవరం : కొండాయిగూడెం గ్రామంలో ఇటీవల వరద ముంపునకు గురైన బాధితులకు యూటీఎఫ్ మండల కమిటీ సభ్యులు 12 రకాల నిత్యావసర వస్తువులను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పాయం కన్నారావు మాట్లాడుతూ యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ సహాయార్థంగా పంపిణీ చేసిన కిట్లు ఒక్కొక్కటి రూ.1500ల విలువ చేస్తోందన్నారు. వంట పాత్రలు, దుప్పట్లు, ఇతర నిత్యావసర సామగ్రి అందజేశామన్నారు. నాగేశ్వరరావు, సీత, సుబ్బారావు, జయసుధ తదితరులు పాల్గొన్నారు.

నేడు పోక్సపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

రంపచోడవరం: మండలంలోని పోక్సపేట సచివాలయం పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జల్లేపల్లి రామన్నదొర శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి హాజరవుతారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.

ఆత్మీయంగా పలకరిస్తూ.. సమస్యలు పరిష్కరిస్తూ



ప్రభుత్వ పథకాల బ్రోచర్‌ను గ్రామస్తులకు అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి



ప్రమాదకర గెడ్డను దాటుతున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నాయకులు



కించుమండలో సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకుంటున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



ముంజుమామిడి గ్రామంలో ప్రభుత్వ పథకాల గురించి గిరిజనులకు వివరిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

- పాడేరు, అరకు, రంపచోడవరం నియోజకవర్గాల్లోని గ్రామాల్లో ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి పర్యటన
- గడప గడపకు విశేష ఆదరణ

సాక్షి, పాడేరు: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి కోరారు.

మండలంలోని వంజంగి పంచాయతీ మారుమూల బి.కొత్తూరు, కొత్తవలస, పోతురాజు మెట్ట, సంపలు, రాసమెట్ట గ్రామాల్లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు.

కుండపోతగా వర్షం కురుస్తున్నప్పటికీ ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లో ఇంటింటా పర్యటించి, ఆత్మీయంగా పలకరిస్తూ, సంక్షేమ పథకాల అమలుతీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాలపై కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రమాదకర గెడ్డను దాటి గ్రామాల్లో పర్యటించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం: పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలవుతున్నాయన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని, రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి పట్టం కట్టి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని బలపర్చాలని ఆమె కోరారు. ప్రతి సచివాలయం పరిధిలో అత్యవసర అభివృద్ధి పనులకు గాను ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేసిందని, లగిశపల్లి సచివాలయం పరిధిలో ఆయా పెండింగ్ సమస్యల పరిష్కారానికి గ్రామస్తుల తీర్మానంతో తగిన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎంపీటీసీ సభ్యుడు రామకృష్ణ పాత్రుడు, సర్పంచులు రాంబాబు, పార్వతమ్మ, వి.రాంబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్‌పర్సన్ సరస్వతి, ఉప సర్పంచులు బుల్లేశ్వరి, సుగుణ, మాజీ సర్పంచులు బొంజుబాబు, సూరిబాబు, కన్నాపాత్రుడు, నేతలు సత్యనారాయణ, లింగమూర్తి, స్వామి, పోతురాజు, రాజారావు, సుశీల, రాజారావు, సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు: అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అన్ని వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమలుచేస్తున్నారని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. మండలంలోని కించుమండ పంచాయతీ కించుమండ గ్రామంలో భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో 73 గడపలను సందర్శించి, సంక్షేమ పథకాల అమలుతీరును, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు సకాలంలో అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యే వద్ద ఆనందం వ్యక్తం చేశారు. బల్లుగుడ గ్రామానికి చెందిన జానకమ్మ అనే గిరిజన మహిళ తనకు రేషన్ కార్డు లేదని ఎమ్మెల్యేతో చెప్పడంతో తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిశీలించి పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం విశేష కృషి చేస్తోందన్నారు. ప్రజలు తమ సమస్యలను తనకు తెలియజేస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఎంపీపీ బాక ఈశ్వరి, జెడ్పీటీసీ సభ్యురాలు జానకమ్మ, వైస్ ఎంపీపీలు ఆనందరావు, లలిత, ఎంపీటీసీ సభ్యులు వరహాలమ్మ, విజయ, సర్పంచ్‌లు చెల్లమ్మ, నాగేశ్వరరావు, మండల పార్టీ మహిళా విభాగ అధ్యక్షురాలు శాంతి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాజ రమేష్, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి కొములునాయుడు, నాయకులు శ్రీరాములు, కృష్ణారావు, మహదేవ్, సింహాచలం, చిరంజీవి, గణపతి, నరేష్, మల్లేష్, సునీల్, ఈవోపీఆర్డీ బాబూరావు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే ధ్యేయంగా సుపరిపాలన : రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

మారేడుమిల్లి: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. మండలంలోని కుండాడ, సున్నంపాడు పంచాయతీల పరిధిలోని కుండాడ, మల్లిసాల ముంజుమామిడి, దేవరపల్లి, సున్నంపాడు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఆయా గ్రామాల్లోని 250 గడపలను ఆమె సందర్శించారు. గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించి, సంక్షేమ పథకాల అమలుతీరు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలతో గిరిజనులకు ఆర్థిక తోడ్పాటు అందుతోందన్నారు. పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు.

సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల చెంతకే పాలనను తీసుకువచ్చారని కొనియాడారు. గడపగడకు కార్యక్రమంలో ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందన్నారు. ఎంపీపీ సార్ల లలిత కుమారి, వైస్ ఎంపీపీ రవికుమార్, మండల కో–ఆప్షన్ సభ్యుడు ధర్మరాజు, పార్టీ మండల కన్వీనర్ సత్యనారాయణ రెడ్డి, కార్యదర్శి గంగరాజు, సర్పంచ్‌లు ప్రభాకర్ రెడ్డి, లక్ష్మి, లచ్చిరెడ్డి, నాయకులు స్మిత్, ప్రేమ్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో కంప్యూటర్ ఆపరేటర్ మృతి



క్రాంతి(ఫైల్)

కూనవరం: జగ్గవరం గ్రామ పంచాయతీ జగ్గవరంకాలనీ(కోతులగుట్ట)కు చెందిన మందపాటి క్రాంతి స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఔట్‌సోర్సింగ్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా గత ఐదేళ్లగా నుంచి పనిచేస్తున్నారు. నాలుగు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యారు. భద్రాచలం ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించుకుని తిరిగి వచ్చాడు. గురువారం ఒంట్లో నలతగా ఉందని మళ్లి భద్రాచలం వెళ్లాడు. అక్కడ ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేరగా ప్లేట్‌లెట్లు పడిపోయాయని, ఖమ్మం ఆస్పత్రికి రిఫర్ చేశారు. ఖమ్మం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందినట్టు కుటుంబీకులు తెలిపారు. ఇటీవల సంభవించిన గోదావరి వరదల్లో సహచర ఉద్యోగులతో కలిసి ముంపు ప్రాంతాల్లో పడవలపై వెళ్లి బాధితులకు నిత్యావసర వస్తువులు, సామగ్రిని క్రాంతి అందించి సేవా దృక్పదాన్ని కనబర్చినట్టు సహచరులు, స్నేహితులు చెప్పారు. క్రాంతి మృతికి పలువురు సంతాపం తెలిపారు.

ఘాట్ రోడ్డుపై కూలిన చెట్టు.. రాకపోకలకు అవస్థలు



తైడ గ్రామ సమీపంలోని మలుపువద్ద విరిగిపడిన చెట్టు

అనంతగిరి: మండలంలోని గడిచిన ఐదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. వర్షాలకు ఘాట్‌రోడ్డు అరకు–విశాఖ ప్రధాన రహదారి తైడ గ్రామ సమీపం లోగల మలుపువద్ద రోడ్డుకు అడ్డంగా చెట్టు విరిగి పడడంతో వాహన రాకపోకలకు ఇబ్బంది తలెత్తుతుంది. రహదారి ఆనుకుని డ్రైనేజీ లేకపోవడంతో ప్రధాన రహదారిపై వర్షపునీరు భారీగా ప్రవహించింది. ఘాట్‌రోడ్డులోని రహదారిని ఆనుకుని ప్రమాదభరితంగా ఉన్న చెట్లను తొలగించాలని, వాహనచోదకులు కోరుతున్నారు.

చినర్యాకురులో ఆర్‌అండ్‌ఆర్ సర్వే



వివరాలు నమోదు చేస్తున్న సర్వేయర్లు

కూనవరం : చినర్యాకురు పంచాయతీ పంద్రాజుపల్లి గ్రామంలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్‌ఆర్ ఇళ్ల సర్వే శుక్రవారం నిర్వహించారు. కుటుంబ యజమాని వివరాలు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, ఓటర్ ఐడీ తదితర వివరాలను సేకరించారు. ఇంటి ముందు యజమాని ఫోటోలు తీసుకున్నారు. అనంతరం సర్పంచ్ సున్నం అభిరాం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ పాయం రంగమ్మ, జెడ్పీటీసీ సభ్యురాలు గుజ్జ విజయలు మాట్లాడుతూ ఇటీవల వరద ముంపునకు గురైన గ్రామాలన్నింటిని 41.15 కాంటూర్‌లో చేర్చి సర్వే చేయాలని కోరారు. సర్వేయర్లు పెద్దిరాజు, మండల సర్వేయర్ గీతా రమేష్, సీనియర్ అసిస్టెంట్ కన్నారావు, వీఆర్వో ధర్మారాజు, వలంటీర్లు ఉన్నారు.

రైతు సంక్షేమ పథకాలను వివరించాలి



:మాట్లాడుతున్న ఎంపీపీ కుమారి

గూడెంకొత్తవీధి: రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలను వివరించాలని ఎంపీపీ బోయిన కుమారి చెప్పారు. రైతు భరోసా కేంద్రాలకు ఎంపిక చేసిన వలంటీర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ సామగ్రి ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయని, వాటిని రైతులకు సక్రమంగా అందజేయాల్సిన బాధ్యత వలంటీర్లపై ఉందన్నారు. ఎంపికైన వలంటీర్లు ఆర్‌బీకేల్లో విధిగా ఉండాలన్నారు. ఈ–క్రాప్ సహా అన్ని అంశాలపై రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. రైతులకు ఈకేవైసీ చేయాలని, ఈ ప్రక్రియను ఈనెల పదో తేదీ లోగా పూర్తి చేయాలన్నారు. ఏవో మధుసూదన్, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు

ఆర్‌బీకే సేవలను విస్తృతం చేయాలి

పెదబయలు: వలంటీర్లు ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందే సేవలపై విస్తృతం గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఏవో శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలో వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమంలో వలంటీర్లకు ఆర్‌బీకేల సేవలపై అవగాహన కల్పించారు. రైతులకు అవసరమైన పరికరాలు, విత్తనాలు, కియోస్క్ యాత్రం వినియోగాన్ని వివరించినట్టు ఆయన చెప్పారు. సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదివితే విజయం సొంతం



మాట్లాడుతున్న సర్పంచ్ త్రినాథ్

ముంచంగిపుట్టు: లక్ష్మీపురంలో గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సర్పంచ్ కె.త్రినాథ్ శుక్రవారం సందర్శించారు. ఉన్నత విద్య, లక్ష్యాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే విజయం సొంతమవుతుందన్నారు. విద్యార్థి దశ నుంచే లక్ష్యాలు నిర్దేశించుకోవాలని సూచించారు. ఉప సర్పంచ్ సత్యం, నాయకుడు సాధురాం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

పెదబయలు: మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరంలో 62–ఆవులకు, 18–గేదెలకు లంపి స్కిన్ వ్యాధి నివారణ టీకాలు, 38–గొర్రెలకు, 15–మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించి, లంపి స్కిన్ వ్యాధి, గొర్రెలు, మేకలు యాజమాన్య పద్ధతులు, కోళ్ల పెంపకంపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు.సిబ్బంది వరలక్ష్మీ తదితరులున్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ



రంపచోడవరంలో ప్లాస్టిక్ నిషేధంపై ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ అధికారులు

రంపచోడవరం: రంపచోడవరం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్పంచ్ మంగా బొజ్జయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీని పంచాయతీ రాజ్ అధికారులు శుక్రవారం నిర్వహించారు. పర్యాటక ప్రదేశంలో ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉందని, ప్రజలందరూ ప్లాస్టిక్ వాడకం మాని, నార, వస్త్ర సంచులను వినియోగించి, పర్యావరణాన్ని కాపాడాలని సర్పంచ్ బొజ్జయ్య కోరారు. నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్‌ను వినియోగించినా, అమ్మకాలు సాగించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంపీడీవో ఆర్.కుమార్‌బాబు, ఈవోపీఆర్డీ ఎస్.జాన్ మిల్టన్, పంచాయతీ కార్యదర్శి రాజు తదితరులు పాల్గొన్నారు.

టీడబ్ల్యూటీఎఫ్ సభ్యత్వ నమోదు

సాక్షి, పాడేరు: గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం సభ్యత్వ నమోదు ప్రక్రియను శుక్రవారం తలారిసింగి ఆశ్రమ పాఠశాలలో ప్రారంభించారు. హెచ్‌ఎం రీమలి జాన్ ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఉపాధ్యాయులు సభ్యత్వం నమోదు చేసుకుని సంఘ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు రామారావు కోరారు. సభ్యులు సూర్యనారాయణ, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా వాగులు, గెడ్డలు



కొయ్యూరు చిట్టింపాడు గ్రామంలో వర్షపు నీరు



పొంగి ప్రవహిస్తున్న గిగుడుపుట్టు గెడ్డ

డుంబ్రిగుడ/హుకుంపేట/కొయ్యూరు: ఏజెన్సీలో గత మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో భారీగా వర్షపునీరు చేరింది. గెడ్డల ఉధృతితో పలు శివారు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. రవాణా సౌకర్యం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డుంబ్రిగుడలో సంపంగి గెడ్డ, లోగేలి గెడ్డ, చాపరాయి గెడ్డలతో పాటు హుకుంపేటలో మత్స్యగెడ్డ, రాళ్ల గెడ్డలు పొంగి ప్రవాహిస్తున్నారు. కొయ్యూరులో చిట్టింపాడు పంచాయతీ గోపవరంలో కొండకాలువ నీరు గ్రామంలోకి చేరింది. ఇళ్లలోకి వర్షపునీరు చేరుతుండడంతో స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. కొండ కాలువ నీటిని మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొయ్యూరు, కాకరపాడు, గొట్లుపాడు, బొడ్డుమామిడిలంక, తీగలమెట్ట కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రహదారులు జలమయమయ్యాయి.

అంగన్‌వాడీ కేంద్రాలకు మహర్దశ

- నాడు– నేడు నిధులు మంజూరు
- కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు



పక్కా భవనం నిర్మాణం కోసం ఎంపికైన బూసిపుట్టు అంగన్‌వాడీ కేంద్రం ఇదే

ముంచంగిపుట్టు: మన్యంలో అంగన్‌వాడీ కేంద్రాలకు ఎన్నో ఎళ్ల తర్వాత మహర్దశ నెలకొంది. ప్రభుత్వం చేపడుతున్న నాడు–నేడుతో సెంటర్ల రూపురేఖలు మారనున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులతో సిబ్బంది నానా కష్టాలు పడుతూ కేంద్రాల నిర్వహణ నెట్టుకొచ్చారు.కొన్ని గ్రామాల్లో పూర్తిగా భవనం పాడైపోయి అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహించాల్సి వచ్చేది. గత టీడీపీ పాలకులకు సమస్య తెలిసినా పట్టించుకున్న దాఖాలాలు లేవు. అంగన్‌వాడీ కేంద్రాల సమస్యను సమూలంగా పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ మేరకు నాడు–నేడు ద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లో కొత్త రూపు తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఒక్కో అంగన్‌వాడీ భవనం కోసం రూ.13.50లక్షల చొప్పున నిధులను ప్రభుత్వం కేటాయించింది. ఆయా నిధులతో భవనాల నిర్మాణంతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. విడతల వారీగా అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక ప్రక్రియ జరుగుతుంది.

ముంచంగిపుట్టు మండలంలో జర్జుల, కులబీరు, పెదతమ్మెంగుల, లంగభపోధర్, పెద్దసింధిపుట్టు, ముంచంగిపుట్టు, రంగబయలు, చంపాపుట్టు, కుమడ, బూసిపుట్టు, సరియాపల్లి, సారధి గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు నూతన భవనాలు మంజూరయ్యాయి.

మారనున్న సెంటర్ల రూపురేఖలు

అరకు నియోజకవర్గంలో నాడు–నేడు ద్వారా 88 అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపిక చేశారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారుల ద్వారా చేపట్టే పనులకు సమీప ఎంపీపీ పాఠశాలల హెచ్‌ఎంల పర్యవేక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు వేగంగా జరగనున్నాయి. కేంద్రాల్లో మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, సురక్షిత తాగునీరు, మైనర్ మరమ్మతులు, మెరుగైన ఫ్లోరింగ్, గ్రీన్ చాక్ బోర్డు, ఫ్యాన్‌లు, ట్యూబ్‌లైట్లు తదితర పనులన్నీ సకాలంలో పూర్తి చేయాలనే లక్ష్యంతో అధికారులు చర్యలు చేపడుతున్నారు.

అరకు నియోజకవర్గంలో ఎంపికైన అంగన్‌వాడీ కేంద్రాలు

మండల	సెంటర్ల సంఖ్య
ముంచంగిపుట్టు	12
పెదబయలు	26
హుకుంపేట	9
అరకు	9
అనంతగిరి	4
డుంబ్రిగూడ	28

మౌలిక వసతుల కల్పన



నాడు–నేడు కింద ముంచంగిపుట్టు మండలంలో 12 అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపికయ్యాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని మౌలిక వసతులు కల్పించేలా పనులు చేయిస్తాం. సెంటర్లకు నాడు–నేడు ద్వారా నిధులు మంజూరు చేయడం చాలా ఆనందంగా ఉంది. దశలవారీగా కేంద్రాల స్థితిగతులు మారితే చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు ఎంతో మేలు జరుగుతుంది.

– ఎస్.రాజేశ్వరి, సీడీపీవో, ముంచంగిపుట్టు

రుణ యాప్‌లపై అవగాహన



మాట్లాడుతున్న సీఐ రవికుమార్

రాజవొమ్మంగి: మండల కేంద్రంలో శుక్రవారం వలంటీర్లు, మహిళా పోలీసులతో సీఐ రవికుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణయాప్‌ల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. యాప్‌ల ద్వారా లోన్ తీసుకోకుండా, అధిక వడ్డీల బారిన పడకుండా గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. వడ్డీ ఇతరత్రా ఆర్థిక లావాదేవీలకు సంబంధించి వేధింపులకు గురిచేస్తే తక్షణమే పోలీసు సహాయం పొందాలని సూచించారు. ఎస్ఐలు గోపీ నరేంద్రప్రసాద్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

డుంబ్రిగుడ: మండలంలోని మారుమూల ప్రాంతం గుంటసీమకు బస్సు సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేదని, రద్దు చేయడంతో రవాణాకు ఇబ్బందులు పడుతున్నామని వారు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు సర్వీసు కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.